నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 20 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## చిన్నారులపై పిచ్చికుక్క దాడి..


గాయపడిన చిన్నారి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 19 : ఆసిఫాబాద్ పట్టణంలోని సాయినగర్, రాజంపేట ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఓ పిచ్చికుక్క ముగ్గురు చిన్నారులపై దాడి చేసింది. ఆరు బయట ఆడుకుంటుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్వల్పంగా గాయపడ్డ ఒకరిని స్థానిక హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని మంచిర్యాలలోని దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. ఇటీవల కుక్కల దాడులు ఎక్కువయ్యాయని, బయటకు వెళ్లాలంటే జంకుతున్నామని, ఇకనైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్,జూన్ 19 : జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం 66 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికసాయమందించేందుక ఈ ప్రతిష్టాత్మక పథకం తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థికసాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాటమార్చిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ఆసిఫాబాద్ పీఏసీఎస్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ పెంటూ పాల్గొన్నారు.

# నాడు వెలుగులు.. నేడు చీకట్‌లు..



- రోజు 12 నుంచి 14 గంటలు మాత్రమే సరఫరా
- గాలి వీచినా, చినుకు కురిసినా అంధకారమే..
- కోతలను నిరసిస్తూ సబ్ స్టేషన్ల ముట్టడి
- పంటలకు పొంచి ఉన్న పెను ప్రమాదం

### ముందే అనుకున్నం గీళ్లు గోసపెడుతరని



కోటపల్లి, జూన్ 19 : కాంగ్రెసోళ్లు ఆనాటి రోజుల తెస్తమంటే.. ఏమో అనుకున్నం. గిట్లా మళ్లా రైతులను గోస పెడుతరనుకోలె. ఎవుసానికిచ్చే కరెంట్ సరిగా ఇస్తలేరు. ఇష్టం వచ్చినట్లు కోతలు పెడుతున్నరు. 24 గంటల పాటు కరెంటిస్తున్నమమని చెబుతూనే రాత్రి పూట బంద్ చేస్తున్నరు. పగలు మాత్రమే అరకొర కరెంటిస్తే పంటలు ఎలా పండుతాయో సీఎంకే తెలియాలె. రేవంత్ సర్కారు రైతులను మోసం చేస్తున్నది.. రెప్పపాటు కరెంట్ పోకుండా కేసీఆర్ సార్ కరెంటిస్తే.. గీ కాంగ్రెసోళ్లు రైతులను అరిగోస పెడుతున్నరు. ముందే అనుకున్నం గీ కాంగ్రెసోళ్లు వస్తే మళ్లా గోసపడుడే అని. ఇప్పుడు గట్లనే అయితంది.

**- రాళ్లబండి పోచం, రైతు, కోటపల్లి**

### నమ్మి మోసపోయినట్లయ్యింది



దహెగాం, జూన్19 : 2014 కంటే ముందు కరెంట్ సరఫరా అధ్వానంగా ఉండే. ఎప్పుడచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెల్వకుండే.. రాత్రీ పగలూ పొలాల కాడ పడిగాపులు కాస్తుండేటోళ్లం. పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేకుండే. గట్లాంటిది తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సార్ రైతులకు ఢోకా లేకుంట చేసిండు. 24 గంటల పాటు కరెంటిచ్చిండు. రంది లేకుంట రెండు పంటలు తీసేటోళ్లం. పదేండ్లు ఎవుసం మంచిగ చేసుకున్నం. ఇగ కాంగ్రెస్ వచ్చిందో లేదు.. మళ్లా గవ్వే పరిస్థితులు దాపురించినయి. ఇష్టం వచ్చినట్లు కోతలు పెడుతున్నరు. ఇదేమని కరెంటోళ్లను అడిగితే మాకేం తెలుసు పైనే కరెంట్ తీసేస్తున్నరు అని చెబుతున్నరు. గీ కాంగ్రెస్ సర్కారును నమ్మి మోసపోయినట్లయ్యింది.

**-తుమ్మిడ మామన్న, దహెగాం**

### కేసీఆర్‌కు సాధ్యమైంది.. కాంగ్రెసోళ్లకు ఎందుకు కాదు..?



కడెం, జూన్ 19 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఇబ్బందులు ఎలా ఉండేవో అలాంటి పరిస్థితులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి మన రాష్ట్రంలోకి తీసుకొచ్చింది. 2014కు ముందు రాష్ట్రంలో వ్యవసాయం చేయడం ఎంతో ఇబ్బందిగా ఉండేది. రాత్రి సమయాల్లో మాత్రమే సాగుకు కరెంట్ ఇచ్చే వాళ్లు, కేవలం రాత్రి మాత్రమే 9 గంటల సరఫరా చేసేవారు. చేను వద్ద కునుకు తీస్తేనే మడి పారేది. చాలా మంది రైతులు పాము కాటుకు, ఇతర విష పురుగులకు బలైపోయారు. వ్యవసాయాన్ని విడిచి పెట్టే పరిస్థితులను తీసుకొచ్చింది. 2014లో ఏర్పాటైన తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ అధ్యక్షతన ప్రత్యేక రాష్ట్రం కోసం కరెంటు కోతలు లేని రాష్ట్రంగా మారింది. రాష్ట్రానికి అవసరమైన కరెంట్ ఉత్పత్తితోపాటు, 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడం, పగటి పూట ఇబ్బందులు లేని కరెంట్‌ను రైతులకు నాణ్యంగా అందించారు. ఫలితంగా వలస వెళ్లిన రైతులు తిరిగి స్వగ్రామాలకు వచ్చి వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారు. ఈ తరుణంలో రైతులకు పెట్టుబడుల సహాయంతోపాటు, అనేక సౌకర్యాలు కల్పించిన ఘనత కేసీఆర్‌ది. కానీ.. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ఆరున్నర నెలల్లోనే విద్యుత్ ఇబ్బందులు తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రీఫేజ్ సరఫరా వేళల్లో కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి సాధ్యమైన కరెంటు.. కాంగ్రెస్ సర్కారుకు ఎందుకు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం రైతులను ఇబ్బందులు పెట్టడమే తప్పా.. రైతుల పక్షాన ఏనాడు నిలవలేదు. పదేళ్ల కాలంపాటు రైతులను ఎలా ఆదుకోవాలని తపన పడిన కేసీఆర్‌పై, ఆయన సరఫరా చేసిన విధానంపై కాంగ్రెస్ మాట్లాడడం అర్థరహితం.

**-సమ్మెట రాజన్న, రైతు, పెద్దూర్, కడెం.**

## కేసీఆర్ హయాంలో నిరంతర కరెంటు | కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర విద్యుత్ సమస్య

ఆదిలాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలో.. భారీ వర్షాలకు తట్టుకుని నిలబడిన విద్యుత్ వ్యవస్థ. బలమైన గాలులు వీచినా తెగిపడని కరెంటు లైన్లు. పెట్టని కోటలా నిటారుగా స్తంభాలు. ధృడంగా ట్రాన్స్‌ఫార్మర్లు. లో ఓల్టేజీ, హై ఓల్టేజీ లేని కరెంటు. ఒక్కోరోజు పది సెంటీమీటర్ల వర్షం కురిసినా.. అంతరాయం లేని మెరుగైన, నాణ్యమైన సరఫరా. ఎక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా నిమిషాల్లో సరిచేసే అధికారులు. అన్ని కలగలిపి నిరంతరం కరెంటును సరఫరా చేశాడు. దండగన్న ఎవుసాన్ని పండుగలా మార్చాడు. పుట్లకొద్దీ వడ్లు పండించి, రైతుల మోముల్లో ఆనందం నింపాడు. కానీ.. ఆరున్నర నెలల కాంగ్రెస్ పాలనలో.. గాలిదుమారం లేచినా, చినుకుపడినా చిటుక్కున కరెంటు తీసేస్తున్నారు. విద్యుత్ తీగలు తెగిపడినా, స్తంభాలు నేలకొరిగినా, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయినా, తీగలు వేలాడుతున్నా విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. లో ఓల్టేజీ.. లేదంటే హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. కరెంటు అంతరాయానికి ఊళ్లకు ఊళ్లు నాలుగైదు రోజులు గాడాంధకారంలో మగ్గుతున్నాయి. పట్టణాల్లోనే గంటల తరబడి కరెంటు తీసేస్తున్నారు. పంటలకు నీరందించేంత సేపు కరెంటు ఉండకపోవడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగిపారేస్తున్నారు. వ్యవసాయం, గృహ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదు. వ్యవసాయానికి అందించే త్రీఫేజ్ కరెంటు 12 నుంచి 14 గంటలు మాత్రమే ఉంటున్నది. వానకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఉంటుంది. కరెంటు మోటార్ల ద్వారా పంటలకు నీరు అందించుకుంటారు. సీజన్ ప్రారంభం కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఇప్పటికే విత్తనాలు నాటారు. వర్షాలు పడకపోవడంతో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. యాసంగిలో కరెంటు కోతల కారణంగా రైతులు పంటలను నష్టపోవాల్సి వస్తున్నది. వానకాలం విద్యుత్ సరఫరాపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి కరెంటు అవసరం లేని సమయంలో రోజు 12 నుంచి 14 గంటలు మాత్రమే కరెంటు వస్తుందని, పంటలకు నీరు అవసమరమైన సమయంలో కరెంటు లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని రెప్పపాటు కరెంటుపోని రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌పై ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిందలు వేయడంపై రైతాంగం మండిపడుతున్నారు. ప్రజలు, రైతుల జీవితాల్లో వెలుగులు పంచిన నాయకుడిపై అభాండాలు మోపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనే లేకుంటే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు.

### దుష్ప్రచారం సరికాదు..



భైంసా, జూన్ 19 : నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెసోళ్ల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామని వట్టి మాటలు చెబుతున్నారు. రాత్రి వేళల్లో గంటల తరబడి కరెంటు లేక ఇబ్బంది పడుతున్నాం. చిన్నపాటి వర్షం కురిసిన, గాలివీచినా కరెంటు కట్ చేస్తున్నారు. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వర్షం సాకుతో గంటల తరబడి కరెంటు తీసేస్తున్నారు. కేసీఆర్ హయాంలో రెప్పపాటు కూడా కరెంటు పోకుండా ఉండేది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు తీసుకరావడంపై కాంగ్రెసోళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. అప్పటి పరిస్థితుల్లో రైతులను రక్షించుకోవడానికి, పరిశ్రమలను కాపాడుకోవడానికి కరెంటు కొన్నారు. లేకపోతే ఇండ్లకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఇబ్బంది పడేవాళ్లం.

**-సాయినాథ్, రైతు, భైంసా.**

### గిట్లయితే బతుకుడెట్లా



తెలంగాణ వచ్చినంక కేసీఆర్ మొదట రైతుల గోస తీర్చిండు. ఎవుసాన్ని పండుగలా చేసిండు. నీళ్లు, కరెంట్ సౌలతులు కల్పించి రైతుకు రంది లేకుంట చేసిండు. పదేండ్లు రైతులు మంచిగ ఎవుసం చేసుకొని లాభపడ్డరు. ఇగ గీ కాంగ్రెస్ సర్కారు వచ్చిందో లేదో.. మళ్లా తిప్పలు మొదలైనయి. కరెంట్ సక్కగా ఇవ్వక రైతులు అరిగోస పడుతున్నరు. గిట్లయితే రైతులు బతుకుడెట్లనో ఏమో.. అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇలా మోసం చేయడం సరికాదు.

**-రఘోత్తమరెడ్డి, దహెగాం**

## కబడ్డీ.. కబడ్డీ..

- విద్యార్థులతో కలిసి ఆడిన కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సందర్శించారు. కాసేపు విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడారు. కబడ్డీ.. కబడ్డీ అంటూ కూతకెళ్లి పిల్లలను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని కలిగించడంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. ఆటలు ఆడటం వల్ల విద్యార్థుల్లో స్నేహభావం, ఐకమత్యం పెంపొందుతుందని చెప్పారు. పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో ముం దుకు సాగాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మొరాయించిన రైల్వే గేటు

**గంట పాటు నిలిచిపోయిన రాకపోకలు**


వేంపల్లి సమీపంలోని రైల్వేగేటు మొరాయించడంతో నిలిచిన వాహనాలు

సిర్పూర్(టీ), జూన్ 19 : సిర్పూర్(టీ)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని వేంపల్లి గ్రామ సమీపంలోగల రైల్వే గేటు బుధవారం ఉదయం సాంకేతిక కారణాలతో మొరాయించింది. ఫలితంగా గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సిర్పూర్(టీ)తో పాటు కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలతో పాటు మహారాష్ట్రకు వెళ్లే రహదారి కావడంతో గేటుకు ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. రైల్వే సిబ్బంది మరమ్మతు చేసిన తర్వాత వాహనాలు కదిలాయి. ఏళ్లకేళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి, ప్రయాణాలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## 108కి తప్పుడు సమాచారమిస్తే చర్యలు


కేసుల వివరాలు తెలుసుకుంటున్న ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్

కోటపల్లి, జూన్ 19 : 108 అంబులెన్స్‌కు తప్పుడు సమాచారమిస్తే చర్యలు తప్పవని 108 వాహనాల ఉమ్మడి ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ హెచ్చరించా రు. బుధవారం కోటపల్లి మండలకేంద్రంలోని 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసి సేవలపై ఆరా తీశా రు. కొంతమంది ఆకతాయిలు 108కి అనవసరం గా కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలా గే కొనసాగితే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అంబులెన్స్ నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. 108కు కాల్ రాగానే పైలెట్, ఈఎంటీ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకోవాలని, అక్కడ బాధితులకు వైద్యం అందించి వెంటనే దవాఖానలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో 108 మంచిర్యా ల జిల్లా కార్యనిర్వహణాధికారి సంపత్, ఈఎం టీ ఓలపు పోచన్న, పైలెట్ ఫరీద్‌అహ్మద్ పాల్గొన్నారు.

# మందుబాబులకు అడ్డాగా పార్కు

- ఆలనా పాలనా లేక అధ్వానం
- ఎటు చూసినా మద్యం, కూల్ డ్రింక్ బాటిళ్లు
- ఇబ్బందుల్లో స్థానికులు


పాతమంచిర్యాలలోని పార్కులో మద్యం సీసాలు

మంచిర్యాలటౌన్, జూన్ 19 : పాతమంచిర్యాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం పదుల సంఖ్యలో మందుబాబులో పార్కులోనే తిష్టవేస్తున్నారు. ఊరుకు చివరగా ఉండడం, వాచ్‌మెన్ లేకపోవడం, కూర్చునేందుకు అనుకూలంగా ఉండడం, నీడనిచ్చే చెట్లు ఉండడంవంటి అంశాలు మద్యం ప్రియులకు కలిసివస్తున్నది. ఏ అకేషన్ ఉన్నా ఇక్కడికి వచ్చి మద్యం తాగడం పరిపాటిగా మారింది. మద్యం, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, ఆహార పదార్థాల కవర్లు ఇక్కడే వదిలేసి పోతుండడంతో డంప్‌యార్డును తలపిస్తున్నది. పార్కులో ఎక్కడ చూసినా ఇవే దర్శనమిస్తున్నాయి. పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని, ఉల్లాసాన్ని కల్పించడం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్కు ఆలనాపాలనా లేక అధ్వానంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. పాతమంచిర్యాలతో పాటు పట్టణంలోని బాలుర పాఠశాల మైదానం, డిగ్రీ కళాశాల మైదానం, చెరువు కట్టలపై ఇలా బహిరంగంగా మద్యం సేవించడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఈ విషయమై సోమవారం పాతమంచిర్యాల నివాసి సోషల్‌మీడియాలో పోస్టు పెట్టడం వైరల్‌గా మారింది. మున్సిపల్ అధికారులు పార్కు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679